క్లుప్తంగా

పైప్‌లైన్ పనుల పరిశీలన

అల్లూరు: అల్లూరు పేట బస్టాండ్ సెంటర్ మెయిన్ రోడ్డులో ముమ్మరంగా జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్ గురువారం పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వాహనదారులకు, గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మేడా పాండురంగారెడ్డి, కరేటి దైవాదీనం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



దుత్తలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎంపీడీఓ సాయిప్రసాద్, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



దుత్తలూరు: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి మండలానికి సరఫరా అయిన టీషర్ట్‌లు, టోపీలు, ప్యాంట్లు గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆయా సచివాలయాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఎల్‌పీ కొండారెడ్డి, నరసింహారెడ్డి, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

ఆత్మకూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఆత్మకూరు పట్టణ ఏఈ మన్మథరావు గురువారం తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయ ఆవరణలో నిర్వహించే ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో చైర్మన్ వి.శ్రీనివాస్ ఆంజనేయమూర్తి, డైరెక్టర్లు కె.రామ్మోహన్‌రావు, ఎస్‌ఎల్ అంజనీకుమార్, బి.ఈశ్వరమ్మ, డీఈ జనార్దన్ ఈ అదాలత్‌లో పాల్గొంటారని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించండి

వరికుంటపాడు: తమ డిమాండ్లను సీఎం జగన్‌మోహన్‌దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన తాను సీఎంను కలిసి డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్తానన్నారు.

మేదరమెట్లకు ఘన నివాళి



జలదంకి: సీనియర్ నాయకుడు మేదరమెట్ల వెంకటకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని బ్రాహ్మణక్రాకలో ఆయన సతీమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ఉన్న మేదరమెట్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ వంటేరు హైమావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చేజర్ల హరిబాబురెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, డాకా గోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకుడు వంటేరు రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ బొల్లినేని

కలిగిరి: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి విమర్శించారు. కలిగిరిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి మేకపాటి కుటుంబంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నర్రావుల అంకిరెడ్డి, చుండి వెంగళరెడ్డి, ఖాజామైనుద్దీన్, వేమనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సంగం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సంగంలోని తుంగా దయాకర్‌రెడ్డి కల్యాణ మండపంలో వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా పింఛన్ రూ.3 వేలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తానని చెప్పిన ప్రతి సంక్షేమ పథకాన్నీ అమలు చేసి చూపారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి ముంగిటకే అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పింఛన్ నగదుతోపాటు పింఛన్‌దారుల సంఖ్య కూడా బాగా పెరిగిందని, ఈ నెలలో ఒక్క సంగం మండలంలోనే 85 నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సంగం మండలవ్యాప్తంగా 6,775 మందికి సామాజిక పింఛన్ల కోసం ప్రతి నెలా రూ.2.07 కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీలు బురద చల్లుతున్నాయని, ఇది ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అవ్వాతాతలను మళ్లీ ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతోనే వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని నంబర్ 1గా నిలిపేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే ఆయనకు మనమిచ్చే కానుక అని, సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించేలా అందరం కృషి చేద్దామని ఎమ్మెల్యే మేకపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి, తహసీల్దార్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ కంటాత్తిన రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తుంగా ఇందూధర్‌రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, మానికల చందన్ కుమార్, నాయకులు గుండాల బాలచంద్రారెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, కరిముల్లా, జనార్దన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పగడాల రఘురామయ్య, మోహన్‌రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

శకునాలపల్లిలో పంచాయతీ గ్రామసభ



పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, ప్రతిపాదనలు రూపొందించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ రూ.3 వేలు నగదును ఆయన పింఛన్‌దారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



పాతపాడులో టాస్ వేస్తున్న నిర్వాహకులు

చేజర్ల: మండలంలో రెండుచోట్ల 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. గురువారం మండలంలోని పాతపాడు, ఆదూరుపల్లి గ్రామాల్లో 5 మ్యాచ్‌లు జరిగాయి. పాతపాడులో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించేందుకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువత విచ్చేశారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికార్జున, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేనమ్మ తదితరులు

ఆత్మకూరు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలతోపాటు ప్రైవేట్ డీలర్ల వద్ద రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఆత్మకూరు సబ్ డివిజన్ ఏడీఏ దేవసేనమ్మ తెలిపారు. మండలంలోని జనతా రైతు బజార్, మన గ్రోమోర్, అగ్రి క్లినిక్, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ, జై కిసాన్ షాపులను గురువారం తమ సిబ్బందితో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో 84 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ప్రైవేట్ డీలర్ల వద్ద 74 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రైవేట్ డీలర్లు ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిభాయిపూలే జయంతి



ఉపాధ్యాయినులను సన్మానించిన ఉపాధ్యాయులు

సోమశిల: అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిభాయిపూలే జయంతిని పురస్కరించుకుని గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బట్టి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయినులు డి.సుభాషిణి, ఆర్.మాలిని, ఎం.రేవతి, ధనమ్మ, నిర్మల, ఎడ్వినా, అలివేలమ్మ, జబీన్, సాదాఉన్నిసాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఆదూరుపల్లి పోలింగ్ కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మధులత

చేజర్ల: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత గురువారం పరిశీలించారు. చిత్తలూరు, ఆదూరుపల్లి, గొల్లపల్లి, పుట్టుపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్, నీటి వసతి, ఇంటర్నెట్, రోడ్డు సౌకర్యం ఉండాలన్నారు. తొలుత చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ సుమతి ఉన్నారు.

సమన్వయంతో పనిచేయండి



ఆర్టీసీ డిపో పరిసరాలను పరిశీలిస్తున్న ఈడీ ఆదాంసాహెబ్

ఉదయగిరి: ప్రజారవాణా సంస్థలో పనిచేసే ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి డిపో అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంస్థ ఈడీ షేక్ ఆదాంసాహెబ్ సూచించారు. ఆయన గురువారం స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డిపోలోని వివిధ విభాగాలను పరిశీలించి డిపో అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది 1,500 కొత్త బస్సులను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అందులో 240 బస్సులు నెల్లూరు జోన్‌కు కేటాయిస్తామన్నారు. సంక్రాంతికి ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు ప్రత్యేక బస్సు సర్వీసులు దూర ప్రాంతాలకు నడుపుతామన్నారు. గతంలో ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేసేవారని ఈ ఏడాది సాధారణ చార్జీలే తీసుకున్నట్లు తెలిపారు. పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు, శుభకార్యాలకు అద్దె బస్సులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే సంస్థ లక్ష్యమన్నారు. ఆయన వెంట డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ సీటీఎం చిరంజీవిరావు, డీఎం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

చేజర్ల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం చేజర్లలో పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు రైతుభరోసా కేంద్రం ప్రారంభం, అనంతరం జలజీవన్ మిషన్ కింద మంజూరైన ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

పెంచిన పింఛన్ల పంపిణీ నేడు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను రూ.3 వేలకు పెంచిన నేపథ్యంలో నూతన పింఛన్లను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ, ఎంపీడీఓల కార్యాలయాల ఆవరణల్లో ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే చేతులమీదుగా మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరై పింఛన్లు తీసుకోవాలని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని నందిపాడులో అక్రమ మద్యం విక్రయాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఉమాశంకర్ తెలిపారు.

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడులు

• ఇద్దరిపై కేసు నమోదు

మర్రిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో నందవరం గ్రామంలో కొండమ్మ అనే మహిళ వద్ద నుంచి 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాంపల్లి గ్రామంలో శ్రీనివాసులు అనే వ్యక్తి నుంచి 4 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

7న సంక్రాంతి సంబరాలు

• నమోదుకు నేడు ఆఖరు

ఆత్మకూరు: పట్టణంలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు గురువారం నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని తూర్పువీధి అలఘునాథస్వామి ఆలయం వెనుక వైపున రైస్‌మిల్లు ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాటం, పండరి భజన, సంక్రాంతి లక్ష్మి, కర్రసాము, కుస్తీ పోటీ, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి సౌజన్యంతో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే వారికి భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలు, కోలాటం, పండరి భజన పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి భారీ నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకునేందుకు శుక్రవారం ఆఖరు అని తెలిపారు. వివరాలకు 94922 58244, 63059 46659 సెల్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన కన్నెమరగల నరసింహులు గురువారం మృతిచెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా, పీఎంఆర్‌ఆర్ పథకం ద్వారా అంత్యక్రియల కోసం రూ.10 వేల నగదును సచివాలయ మండల కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సర్పంచ్ కె.లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యుడు అక్కలరెడ్డి కొండారెడ్డి అందజేశారు.

ప్రతి పల్లెలో ప్రగతి వీచికలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అనిల్‌బాబు

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి పల్లెలో ప్రగతి కనిపిస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబుతో కలిసి బోగోలు మండలం చెన్నారాయినిపాళెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించే సంక్షేమ పథకాల బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా పాలనను నేరుగా ప్రజల ముంగిటకే తీసుకెళ్లడంతోపాటు రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో అట్టడుగు వర్గాలకు సైతం ఆర్థిక భరోసా కల్పించారన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని, రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి సమున్నత ప్రణాళిక అమలు చేస్తున్నారని తెలిపారు. ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారుల అభివృద్ధి కోసం రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మంజూరు చేయడంతోపాటు శరవేగంగా నిర్మాణాలు పూర్తి చేయించిన ముఖ్యమంత్రికి మత్స్యకార గ్రామాలన్నీ రుణపడి ఉంటాయని అన్నారు. ముఖ్యమంత్రి తీరప్రాంతానికి చేసిన మేలుకు కృతజ్ఞతగా కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించి కానుకగా అందించాలని పిలుపునిచ్చారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ల ద్వారా తీరప్రాంత గ్రామాల రూపురేఖలే మారనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ సభ్యురాలు మద్దిబోయిన కీర్తన, సర్పంచ్ కొండూరు గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, నాయకులు తూపిరి పెంచలయ్య, తుమ్మల రమణయ్య, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే ప్రథమంగా రూ.3 వేలు పింఛన్



పింఛన్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: దేశంలోనే అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల చొప్పున పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఈ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ పెంపు ఉత్సవంలో భాగంగా నూతన పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్రాంతి కంటే ముందుగానే నిజమైన పండగ వచ్చిందని అన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు నచ్చితేనే పింఛన్లు ఇచ్చేవారన్నారు. అందులోనూ ఎవరో ఒకరు చనిపోతేనే కొత్త పింఛన్ మంజూరు చేసేవారని గుర్తుచేశారు. కాగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పింఛన్లు అందిస్తున్నారన్నారు. దుత్తలూరు మండలంలో 3,767 మందికి పింఛన్ల కోసం నెలకు రూ.1,11,75,370 ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. నవరత్నాలతో అన్నివర్గాల వారికి మేలు చేకూరుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పాలన అందించి పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ఓటు రూపంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకొని 2024 ఎన్నికల్లో బంపర్ మెజారిటీ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, మండ్ల శివ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు ఎంపీడీఓ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి ఫలాలు అందరికీ చేరాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి కల్పిస్తున్న ఉపాధి పనులతోపాటు ఈ పథకం ద్వారా అమలులో ఉన్న ప్రాయోజిత పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందజేయాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని ఉపాధి హామీ మేట్‌లకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పండ్ల తోటల పెంపకం, పొలంగట్ల వెంబడి మొక్కల పెంపకం, రైతుల పొలాలకు మట్టి తోలడం, పంట కుంటల నిర్మాణం, పొలాలకు గట్లు వేయడం తదితర కార్యక్రమాల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు. అలాగే పనుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిన బాధ్యత ఉపాధి మేట్‌లపై ఉందన్నారు. అలాగే ఈ నెల 1వ తేదీ నుంచి ఉపాధి హామీ ద్వారా జరిగే పనులను ప్రతి రోజూ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో సమగ్రమైన పద్ధతిలో నమోదు చేయాలన్నారు. ప్రతి రైతు, ప్రతి కూలి ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొనేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శిరీషారెడ్డి, ఈసీ జానకి, టీఏలు వినోద్‌బాబు, రవితేజ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: బోగోలు మండలం చెన్నారాయినిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో వసతులు, జగనన్న గోరుముద్దలో భాగంగా అందిస్తున్న మెనూపై విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సమాజ ఉన్నతికి విద్య చాలా కీలకమని, అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ట్రెక్కింగ్‌లో విద్యార్థుల సత్తా



ట్రెక్కింగ్, ఎన్‌సీసీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కావలి: మండలంలోని గౌరవరంలో ఉన్న రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి ఎన్‌సీసీ విద్యార్థులు ఎం.సుశాంత్, జి.ప్రణీత్ కేరళలోని నిర్వహించిన జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికవడంతోపాటు ట్రెక్కింగ్, ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభినందించారు.